# దారితప్పిన మనిషి

తెలక రామారావు


అప్పుడే నిద్ర పట్టింది.

దబ దబా తలుపు చప్పుడైంది. మా ఆవిడ వెళ్ళి తలుపు తీసింది. ఏవేవో మాటలు వినపడ్డాయి. అయినా నే కళ్ళు తెరవలేదు కావాలనే!

కొన్ని క్షణాల తర్వాత, మా ఆవిడ వచ్చింది.

''మీరోసారి రావాలి''

లేవక తప్పలేదు. బయటకు వెళ్ళా



రిక్షా తాత హుస్సేన్, చెమటలు తుడుచుకుంటూ కనుపించాడు. బయట రోడ్డు మీద రిక్షాలో ఓ ముసలాయన అంపశయ్య మీద భీష్ముడిలా పడి వున్నాడు.

''సాబ్! ఈ ముసలివాడు చావుకు సిద్ధంగా వున్నాడు! మీరోసారి దయచేసి చూడండి'' హుస్సేన్, ఆదుర్దాగా చెప్పాడు.

రోహిణీ కార్తె ఎండ! నీడ లోంచి ఎండలోకి వెడితే వళ్ళు కాలుతున్నది. రిక్షాలో పడి వున్న ముసలాయన చచ్చిపోయ్యాడో, బ్రతికి చావు కోసం ఎదురు చూస్తున్నాడో, తెలియని అపస్మారక స్థితిలో వున్నాడు.

''ఏం జరిగింది? అసలీ తద్దినం నీకెక్కడ దొరికింది?'' హుస్సేన్ని అడిగా! హుస్సేన్ చెప్పినదేమంటే హుస్సేన్ బడిపిల్లలను స్కూళ్ళ దగ్గర దింపేసి, ఇంటికి బయలుదేరాడు, అన్నం తిని వద్దామని దారిలో ఓ చెట్టు క్రింద, ఈ ముసలాయన పడుకోనున్నాడు. చుట్టూతా పిల్ల కాయలు చేరి వింతగా ముసలాయనను చూస్తున్నారు. ముసలాడు ఏదో అరుస్తున్నాడు.

హుస్సేన్ ముసలాయన్ను చూస్తే జాలేసింది. పండ బారిపోయిన బ్రాహ్మడు. నుదుటి మీద, త్రిమార్గం చారలు. వెండి తీగల్లా బట్టం మీద, గడ్డం మీద పెరిగిన వెంట్రుకలు, అగ్గిపుల్ల పట్టేంత చెవులకు రంధ్రాలు, మాసి చీకిపోయిన యజ్ఞోపవీతం మాసిన పంచె. ప్రక్కన, కంపెనీ పేరు వూరు చెరిగిపోయిన గుడ్డ సంచి, అందులో రాగి చెంబు. చిరిగి పోయిన పంచాంగమ్.

అయ్యవారు, పట్నంలో కొచ్చి దారి తప్పాడో! కావాల్సిన వాళ్ళు ఊళ్ళో లేరో!

హుస్సేన్ అయ్యవారి దగ్గర కెళ్ళి ''సామీ! యాడ కెళ్ళాలి?'' అనడిగాడు.

''తీసుకెడతావా?''

''పెద్ద మడిసివి, దా, నీ ఇంటికాడ దింపుతా!'' అన్నాడు.

ముసలాయన రిక్షా ఎక్కాడు.

అది మొదలు, హుస్సేన్ కష్టాలు ప్రారంభమైనాయి.

''యాడికి బోవాలి?''

''మా ఇంటికి!''

''యాడ మీ ఇల్లు?''

''మా వూళ్ళో?''

''ఏది మీ వూరు?''

అయ్యవారు మాట్లాడడు.

హుస్సేన్, కిరాణా దుకాణాల్లో, హోటల్లో, బస్ స్టాపుల్లో, కనపడ్డవాళ్ళనల్లా వాకబు చేశాడు ఈ ముసలాయన ఎవరి తాతాకానో, ఏ వూరో సమాచరం తెలుసుకునేందుకు. ప్రయత్నం ఫలించలా! ముసలాయన చెప్పడు. ఎంతసేపూ మా ఇల్లు, మా వూరు అంతే!

హుస్సేన్కి చిరాకొచ్చింది. పోలీసు స్టేషన్కు తీసుకెళ్ళాడు. అక్కడ అప్పచెప్పితే, వాళ్ళే చూసుకుంటారని!

స్టేషన్లో ఎవ్వరూ లేరు, బక్క ముసలి అమాను తప్ప.

హుస్సేన్, అమానుకు సంగతంతా చెప్పి, ముసలాయన బాధ్యత అప్పగించాలనుకుంటే,

అమాను పడనివ్వలేదు.

''దొర లేదు! వచ్చాక రాపో!''

''ఎప్పుడొస్తాడు?''

''ఏమొ! నాకేమన్నా చెప్పి పోతాడా దొర!''

''యాడికి బోయిండు''


''డూటీ మీద!''

''అదే ఎక్కడకు?''

''తెల్వదు!''

''మరి మిగతా జవాన్లు ఏమైనారు?''

''డ్యూటీ మీద బోయిండ్రు''



''యాడకు బోయింద్రు''

''నీయవ్వ! ఆ వైనాలు నీకెందుకూ?''

''మరి ఈ అయ్యవారినేం వెయమంటావ్?''

''తోల్కపో!''

''యాడకు! బొందలోకా?''

''నీయవ్వ! నాకే సవాళ్లిసురుతావ్! బేగెళ్ళు. లేక పోతే...''

''ఏమి చేస్తావ్?''

''ఎందుకూ?''

''నీయవ్వ పోరా! శని మాలె తగిలినావ్?''

''ఓ గంట, ఇంకో గంట, మరో గంట! అమాను తప్ప స్టేషన్‌లో, మరో ప్రాణి లేదు. ఎండ మండి పోతున్నది. కడుపులో ఆకలి. హుస్సేన్‌కు దిక్కు తోచలా!

''అయ్యవారూ! ఈడ దిగుడీ!''

అయ్యవారు రిక్షాలోనే వాలిపొయ్యాడు. మాట లేదు. పలుకు లేదు.

హుస్సేన్‌కు దిక్కు తోచలా!

ఏమైతే అదయింది. ఏ చెట్టు క్రిందో బస్సు స్టాపు లోనో దింపెద్దామనుకుని

రిక్షా తీసుకుని బయలుదేరాడు.

ఓ చెట్టు క్రింద శుభ్రం చేసి, అయ్య వారిని దింపు దామనుకుంటే

ఆ చెట్టు క్రింద చెప్పులు కుట్టేవాడు చూశాడు.

''ఏంది!'' అన్నాడు.

హుస్సేన్‌కు ఏం చెప్పాలో తోచలేదు.

''అయ్యవారిని ఈడ దింపుతా!''

''ఎందుకూ?''

హుస్సేన్ సమాధానం చెప్పేలోగా,

''ముసలాయన కాడ డబ్బులు నూకి, ఆ పెద్ద మడిసిని ఈడ పారేసి పోతావా?'' అవన్నాడు.

''గొడ్డు మాంసం తినే నీకు నేనేం చెబుతాలె! ఎల్లెల్లు. ఆయన్ను ఇంటికాడ దింపిరా పో!'' అని గూడ గదమాయించాడు.

హుస్సేన్, చేసేదేమీ లేక, ముసలాయన్ను తీసుకు వచ్చాడు.

ఇదీ హుస్సేన్ చెప్పిన కథనం.

''సాబ్! ఉదయం నుంచి బువ్వ లేదు! మీరే, ఏదో దారి చూపండి!'' అన్నాడు దీనంగా!

మా ఆవిడ వేపు చూశా!

''తీసుకొచ్చి వరండాలో పడుకోబెట్టండి!'' అంది

నేను, హుస్సేన్, ఎత్తుకుని తీసుకు వచ్చి వరండాలో పడోబెట్టాం ముసలాయన్ను.

హుస్సేన్ వెళ్లాడు, మళ్ళీ సాయంత్రం వస్తానని.

మా ఆవిడ మజ్జిగలో

నిమ్మకాయ పిండి, ఉప్పేసి,

చెంచాతో పోసింది. కొన్ని ముసలాయన గొంతులో, మ్రింగాడు. కొన్ని పెదవుల నుంచి జారి పోయాయి.

సాయంత్రం దాకా, ఆ ముసలాయన కళ్ళు తెరవ లేదు. ఘడియకోసారి, ఎక్కిళ్ళు పడటం, మూలగటం.

సాయంత్రం, డాక్టరు వేణుని తీసుకొచ్చా. నాడి చూశాడు. కనురెప్పలెత్తి పరీక్షించాడు. రెండు డోసులు, హోమియోపతి మందు ఇచ్చి

"జబ్బు ఏమీ లేదన్నాడు. కాకపోతే తిండి లేక ఇలా అయ్యాడు. మర్నాం పొద్దుటికి స్మారకం రావచ్చు!" అని చెప్పి వెళ్ళాడు.

పోస్ట్‌మేన్ వచ్చి చూశాడు.

"ఏం అయ్యవారు యాడనుంచొచ్చెనో, యాడ బతికిండో! ఇక్కడ వచ్చి పడినాడు" అన్నాడు.

ఆ రాత్రంతా, నేనూ, మా ఆవిడా వంతుల వారీ మేలుకుని కాపలా కాశాం. తెల్లారు ఝామునకు ఇద్దరం నిద్రపోయాం, ఇక కాపలా చెయ్యలేక!

తెల తెల వారుతుండగా, మా అబ్బాయి వచ్చి గాభరాగా చెప్పాడు 'తాత వెళ్ళి పోయాడ'ని




నేను మా ఆవిడా క్షణం నమ్మలా. లేచి వరండాలో కెళ్ళి చూశాం. అక్కడ అయ్యవారు లేరు. ఏమై వుంటాడూ?

మాకేం తోచలా! క్షణం

"తెలివొచ్చి వుంటుంది. లేచి వెళ్ళుంటాడు" అని సరిపెట్టుకున్నాం.

ఓ రకంగా, ముసలాయన బాధ్యత తీరింది గదా అని సంతోష పడ్డాం.

కానీ ఆ సంతోషం ఎక్కువ సేపు నిలవలా!

పని మనిషి, అంట్లు తోమేందుకు బావి దగ్గర కెళ్ళి, అక్కణ్ణుంచి గావు కేక పెట్టింది.

నేను, గడ్డం గీసుకోవడం ఆపి, పరిగెత్తా దొడ్లోకి!

మా ఆవిడ వంటింట్లోంచి ఒక్క ఉదుటున వచ్చింది.

"ఏమైందే?"

"అదుగో ముసలాయన?"

"ఏడీ!"

కొంప దీసి, బావిలోకాని పడ్డాడా? అన్న అనుమానం కలిగింది.

"అదేంటండీ! బావికి అటు ప్రక్కన!"

పని మనిషి చెప్పిన వేపు వెళ్ళాం.

అక్కడ, బావి కటు వేపు, పద్మాసనం వేసుకుని సంధ్యా వందనం చేసుకుంటున్నాడు.

కొబ్బరి ఆకుల, వెలుగు నీడల్లో, పద్మాసనం వేసుకున్న అయ్యవారు , అపర రామానుజాచార్యుల్లా వున్నారు, మాదేవాళ్ళు. నమస్కరించి ఆశీర్వచనం తీసుకోవాలనిపించేలా?

తదేక ధ్యానం, పరిసరాలను గుర్తించకుండా!

రాత్రి స్పృహ లేని మనిషి తెల్లారేసరికి మామూలు మనిషిలా వున్నాడు.




రెండు బారల ప్రొద్దెక్కాక, అయ్యవారు గుడ్డలు ఆరబెట్టుకుని, కట్టుకుని వచ్చాడు.

మా ఆవిడ పాలు పంచదార తెచ్చి యిచ్చింది.

'ఆవు పాలు తప్ప త్రాగను!' అన్నాడు అయ్యగారు.

"అయ్యా! ఇక్కడ ఆవు పాలు దొరకవు"

అయ్యవారు మాట్లాడలేదు. పాలు త్రాగలేదు.

"గుడి వుందా ఇక్కడ!"

"ఆ! ఆంజనేయ స్వామి గుడి వుంది!"

మా అబ్బాయి వెంట రాగా గుడికెళ్లాడు.

"అయ్యగారికి వంటెలా?"

"తింటే మనతో తింటాడు. లేదా వంట చేసుకోమను!"

"కట్టెలు, పిడకలు కావాలంటే?" మా ఆవిడ ఎదురు ప్రశ్న వేసింది.

అవును ఎలా?

హైదరాబాదు నగరంలో కట్టెలు, పిడకలు, ఆవు పాలు ఎలా తేవడం!

ఇంతలో అయ్యవారు ధుమ ధుమ లాడుతూ వచ్చాడు.

"వస్తూనే,

"అది గూడా! అక్కడ వున్నది ఆంజనేయ స్వామి! ఛఛ!"

అయ్యవారు ముణగదీసుకుని, గొణుక్కుంటు న్నాడు.

"ఏమైందిరా?"

మా అబ్బాయి చెప్పిందేమంటే,

ఇద్దరూ గుడి కెళ్లారుట. వీళ్ళు వెళ్ళే సరికి, గుళ్ళో వున్న పూజారి మెట్ల మీద కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడట.

అయ్యవారు, పూజారిని చూస్తూనే. "అప్రాచ్యుడా! పొగ త్రాగే నువ్వు, కేశవ నామాలు ఎలా చెబుతావ్!" అని మండిపడ్డాడట.

పూజారి బిత్తరబోయి నిలబడ్డాడు.

"ఆ బనీను విప్పు ముందు. బ్రాహ్మడివైనందుకు సిగ్గు లేదూ. ఇలానేనా గుళ్ళో వుండేది" అని కోప్పడ్డాడు.

పూజారి బనీను విప్పాడు భయానికి, అయితే, బనీనుతోపాటు యజ్ఞోపవీతం కల్సి క్రింద పడ్డది.

అయ్యవారు ఆగ్రహోద్రుడయ్యాడు.

"నువ్వు బ్రాహ్మడి వేనా అస్సలు వంటి మీద యజ్ఞోపవీతం వుందో, ఊడిందో కూడ తెలియని మత్తులో వున్నావు. ఛీ ఛీ! శిరస్సు మీద ఆ జుత్తేమిటి? నీకూ, ఆ బ్రాహ్మడికి తేడా ఏముంది? అందుకే బ్రాహ్మణ్యం అధోగతి పాలైంది!"

అయ్యవారు గుడినీ, గుళ్ళో ఆంజనేయ స్వామి అని జనం మొక్కే రాతినీ, గుడిచుట్టు వున్న అశుద్ధాన్ని పందుల్ని చూపి.

"ఛ ఛ! ఇది ఆలయం కటాదు. అస్సలా ఆంజనేయుడికి రూపం లేదు. ఏదో రాతికి ఇంత ఎర్ర రంగు పూస్తే, దేవుడౌతాడా? అబ్బే! ఆ గుడేమిటి? నాలుగు రాళ్ళా, పైన దిమ్మా! యిదేమి ఆలయం! ఓ ధ్వజ స్తంభం లేదు. ప్రాకారం లేదు. శుచి లేదు. పవిత్రత లేదు. చక్కటి వాతావరణమూ లేదు. ఛ ఛ! పదరా అబ్బాయి!"

అని అయ్యవారు తిరిగొచ్చారు.

ఆ మాటె మా అవిడతో అంటే, "అవన్నీ అలా వుంచండి. ఈయన ఏమీ తినకుండా, ప్రాయోప వేశం చేస్తాడేమో? ఖర్మ! త్వరగా ఈయన్ను వదిలించు కోండి" అనన్నది.

ఆ రోజు, ఇన్‌స్పెక్టర్ విక్టర్‌తో మాట్లాడా! ఆయన ముసలాయన బొమ్మ తీయించి పేపర్లో ప్రకటన ఇవ్వమన్నాడు. రేడియో, దూరదర్శన్ ద్వారా అయ్యవారి సమాచారం చెప్పించమన్నాడు.

అవన్నీ చేశా!

అయ్యవారు కొబ్బరి నీళ్ళు, కొబ్బరి అరటి కాయలు తింటూ రోజులు వెళ్ళబుచ్చుతున్నాడు.

అయ్యవారు క్రమం తప్పకుండా, త్రికాల సంధ్య నిర్వర్తించేవాడు. గోవిందాష్టకం, రామదాసు కీర్తనలు, త్యాగరాజు కృతులు, భగవద్గీత పారాయణ చేసేవాడు. ఇవే నిత్యకృత్యం.

అప్పుడప్పుడు శూన్యంలోకి చూస్తూ గాలితో మాట్లాడేవాడు. వుండీ వుండీ ఏనుకోవడం, నవ్వడం, దూర తీరాలకు చూస్తూ, నిరాశ చెందడం, ఇది కూడా దిన చర్యలో భాగమైంది.

ఇవన్నీ మాకు అలవాటయినాయి.

అయ్యవారు, ఇంట్లో మనిషిగా కల్సిపొయ్యాడు.

కానీ ఎన్నాళ్ళు?

ఈయన చివరికు ఏమవుతాడు?

## అయితేనేం?

కోలాహలం-
శరీరాన్ని మెలిదిప్పి, పిడిచి హరించే
హాలాహలం-ఈ యంత్ర మంత్రాలయం;
బిందువుగా వున్నప్పుడు
ఆకు కొసను కదలాడి
ఇంద్రధనుస్సును కలగన్నప్పటి
ఏకాంతం, కలత నిదరలో
కలలో కలగా కాలిపోయి
కమిలిపోయి-,
ఏమిటీ కోలాహలం?
అదిగో - అన్ని తలల
ఆలోచనా తరంగాల మధ్య
కళ్లు చికిలించి - పారిపోయే
కన్నీటి మనిషిని చూడండి-
జనసందోహం అలసట నుంచి
తెగిపడిన నాగరకత పేరిట
తోరణంలో రంగు కాగితం
అతను -
తన ముఖమేదో కోల్పోయి
తన్నుతాను వెతుక్కోవడానికి
ప్రశ్నల మేకుల బాట మీద
నెత్తురు చారికలతో
అతను - ఆరవలేడింక

***

వేట - అడుగుల జాడ వెంట వేట-
నిలువనివ్వనప్పుడు
నిలువనీడ కూడా తొలగి
చెరిగి పోయినప్పుడు
మనిషి పరుగులు పెడతాడు
కరుకురాతి గోడలు కూలదన్ని మరీ
ఆకాశం చివరకంటా
శకల శకలాలుగా పగిలి
శతఘ్ని గోళంలాగ ప్రేలి, వ్యాపించి
ప్రజ్వలిస్తాడు
తగలబెడతాడు
తగలబడతాడు...
ప్రశ్నకూ, ప్రశ్నకూ పుట్టిన మనిషి
ప్రశ్నల రెక్కలు విరిచి
ప్రకంపింపజేస్తాడు-
అతడప్పుడు తాత్కాలికంగా
ఒంటరి-
అతని అన్వేషణకు, ఆర్తికి
జవాబు దొరికి తీరాలి

*

— ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

## రహదారి పరుగు

పెట్టుబడిదారీ వ్యవస్థలో
శ్రామికుడి అభివృద్ధి;
మోటారు గమనంలో
రోడ్డు పరుగెత్తడం లాంటిది.

## కార్మికులు

అర్థరాజ్యం తమకు రావలసి ఉన్నా—
అయిదూళ్ళు మాత్రమే అడుగుతున్న,
అభినవ పాండవులు.

—ఎల్. భూదేశ్వర రావ్

ఏ వూరు?
అన్నీ ప్రశ్నలే.
అయితే, అయ్యగారు
అడపాదడపా చెప్పిన విశేషాలు,
గొణుగుడులో వినిపించిన మాటలు,
అన్నీ క్రమంగా పేర్చితే ఓ మనిషి కథ
అవుతుంది. ఈ మనిషి దారి
తప్పాడు. ఎక్కడ, ఎందుకు, ఎలా తప్పాడో తెలియదు.

అప్పిచ్చువాడు, వైద్యుడు, ఎప్పుడు ఎడ తెగక పారు ఏరు వున్న అగ్రహారం అది.

మూడొంతుల జనాభా బ్రాహ్మణ్యం. అందరికీ భూమి, సంపదా, పశుగణం వున్నాయి. చిన్నప్పట్నుంచీ వేద వేదాంగాలు, నృత్య సంగీతాలు, సాహిత్య, పురాణ, ప్రవచనాలు ... అన్నీ అందరికీ అబ్బినాయి.

వూళ్ళో యజ్ఞాలు చేసిన సోమయాజులు, కాశీ రామేశ్వరాలు చుట్టి వచ్చిన సంపన్నులు, వైదిక వృత్తితో గడిపే పురోహితులు, అవధానాలు చేసే కవి పండితులు, శరీరాన్ని దైవార్పణం, ధనవంతుల జీవితాలకు హారతి ఇచ్చిన వేశ్యాంగనలు, కాపులు, కమ్మలూ, రెడ్డి ప్రభువులూ, కుల వృత్తి చేసుకు బ్రతికే కమ్మర, చాకలి, వడ్రంగి, దొమ్మర, వడ్డెర, యానాది, భజంత్రీలు అందరూ వున్న ఆ వూళ్ళో శివాలయం, వేణు గోపాల స్వామి ఆలయం వున్నాయి.

అయ్యవారు, వేణుగోపాల స్వామికి, వంశ పారంపర్యంగా వచ్చిన ఆలయ అర్చకుడు. తల్లీ, తండ్రీ, విధవప్పగారూ, గుడ్డి, చెవిటి మేనమామ, పెళ్ళికాని కోడలూ, కూతుళ్ళూ, మనవలూ, మనవరాళ్ళు, మంచితనం, వూళ్ళో ప్రాపకం, అన్నీ సమృద్ధిగా వున్నాయి.

స్వామివారి సేవ, మిగతా సమయంలో కుటుంబ పోషణ తాపత్రయం తప్ప, మరో ప్రపంచం తెలియదు అయ్యవారికి.

ధనుర్మాసం వస్తే, ఉదయం లేచి, హరినామ సంకీర్తనతో వూరంతా తిరిగి రావడం, మధ్యాహ్నం దైవానికి నైవేద్యం పెట్టి, భోజనం చేసి విశ్రమించడం.

సాయంత్రం పురాణ కాలక్షేపం, లేదా హరి కథా శ్రవణం.

రోజులు ఒకేలా వుండవు గదా! ధర్మం మారింది. వృత్తులు మారాయి. సామాజిక స్థితి మారింది.

అయ్యవారు గతి తప్పారు. దారి మర్చి పొయ్యారు. గతం కళ్ళ ముందు వుంది. ప్రస్తుతానికి ఇమడలేక పొయ్యారు.

అయ్యవారి గురించి ఇది నా రేఖా చిత్రం.

కానీ, అయ్యవారిని వాళ్ళ వూరికి పంపడం నా విధి.

ఇదే నా విన్నపం.

మా వూరు అగ్రహారం అయి, ఇంకా ప్రాచీన సాంప్రదాయాలకు, నీతికి, ధర్మానికి నిలయమైతే, అయ్యవారు మా వూళ్ళో శేష జీవితం గడపగలడని మీరు నమ్మితే తెలియచేయండి.

అయ్యవారిని పంపుతా.